క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘించొద్దు

చారకొండ: నిబంధనలు ఉల్లంఘించొద్దని ఏఓ తనూజరాజ్ డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో సోమవారం మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ తనూజరాజ్ మాట్లాడారు. డీలర్‌లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లు, బోర్డును విధిగా ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఈఓలు వంశీ, సంతోష, డీలర్‌లు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ స్టేజి వద్ద సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకునట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఉప్పునుంతల మండలం మొల్గర దుందుబీ వాగు నుంచి అదే గ్రామానికి చెందిన ఈదుల లక్ష్మయ్య, పోతుల రాజు, గుండ్రాతి రమేష్‌గౌడ్, ఉల్పర శ్రీనులు ట్రాక్టర్ల ద్వారా బల్మూర్ మండలంలోని గట్టుతుమ్మెన్‌కు అక్రమ ఇసుకను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకునట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను స్వాదీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూలిన పాత వ్యవసాయ కార్యాలయ భవనం



కల్వకుర్తిరూరల్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న పాత వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం సోమవారం కుప్పకూలింది. వారం రోజులుగా కురిసిన వర్షాలకు గోడలు తడిసిపోయాయి. దీంతో భవనానికి ఒకభాగం వైపు ఉన్న గోడ కూలింది.

వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లించాలి

కొల్లాపూర్ రూరల్: నియోజక వర్గంలో వివిధ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో వంట వండుతున్న ఏజెన్సీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని దళిత దండు నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెల వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చుక్కాయిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంట వండుతున్న మహిళలతో ఆయన మాట్లాడారు. నాలుగు నెలల నుంచి ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోతే వంటలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

పెద్దకొత్తపల్లి: బాల్య వివాహాలను అరికడదామని కోనేరు సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కైలాశ్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, అహ్మద్, కొండలయ్య, జియావుద్దీన్, శేఖర్, కవిత, వసంత, శశికళ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



కొల్లాపూర్: పట్టణంలోని 12, 13వ అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారానికి సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే పోషకాహారం వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు శ్రీశైలమ్మ, సఫియా తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

కోడేరు: మండలంలోని మూలమడత తండాకు చెందిన సాయిరాం అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ. 52,500లు మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజునాయక్, వెంకటేష్‌లు బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.

నల్లమల యువకుడికి పీహెచ్‌డీ పట్టా

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్‌కు చెందిన దాసిరెడ్డి మహేందర్‌రెడ్డి(నీరు, నేల పరిరక్షణ) అగ్రికల్చరల్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. సోమవారం తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో నిర్వహించిన కాన్వకేషన్‌లో వీసీ గీతాలక్ష్మి నుంచి పట్టా అందుకున్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



పెద్దకొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కోడేరు మండలం కొండ్రావుపల్లిలో..



వెల్దండ మండలం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో..

స్ఫూర్తిప్రదాత కాళోజీ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని గంగారం జెడ్పీహెచ్‌ఎస్, ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయుడు శ్రీధర్, ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, హెచ్‌ఎం రాజారెడ్డి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, డైరెక్టర్ సువర్ణలు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోడేరు: మండలకేంద్రంతో పాటు కొండ్రావుపల్లి, ఎత్తం, నర్సాయిపల్లి తదితర పాఠశాలల్లో కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కాళోజీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో కళాకారులు నివాళులర్పించి కాళోజీ సేవలను కొనియాడారు. దేవల్‌తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు భాషపై పద్యం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు సునీత, కళాకారులు, మల్లయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: కాళోజీ జీవితం ఆదర్శమని హెచ్‌ఎం బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాళోజీ జయంతిలో వారు పాల్గొన్నారు.

తాడూరు: అన్యాయాన్ని ఎదిరించిన ధీశాలి కాళోజీ అని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిజినేపల్లి మండలం గంగారంలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వెల్దండ: మండలంలోని గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సుమన్, భాస్కర్, సుధీర్, అరుణ, చంద్రబాబు, ధర్మేందర్, తదితరులు ఉన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చెన్న కిష్టన్న హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. అచ్చంపేట హాస్టళ్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అంతటి కాశన్న, హనుమంతు, వెంకటయ్య, కృష్ణయ్య, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు..



వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షానికి బ్రిడ్జితో పాటు తాత్కాలికంగా నిర్మించిన సిమెంట్ పైపులు కొట్టుకుపోయాయని దీంతో దాదాపుగా 8 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయినట్లు వివరించారు. నర్సింహా, మెండె మల్లేష, సాయి తిరుపతి, కృష్ణయ్య, గిరిప్రసాద్, కోటయ్య, వెంకటయ్య, రాజు, బాలకృష్ణ, వెంకట్, యాదయ్య తదితరులు ఉన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలని..

అమ్రాబాద్: మండల కేంద్రంంలోని లోకేశ్వరం చెరువు, ఎర్రకుంట, అబ్బాస్‌కుంటలలో ఆక్రమణలు గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ రావూఫ్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు, కుంటలకు సంబంధించిన భూమిని పరిసర రైతులు ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోల సత్యనారాయణ, కృష్ణయ్య, నాగరాజు, నరహరి ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అచ్చంపేట రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీబీఎం చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ అన్నారు. సోమవారం పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన కమిటీ సభ్యులను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో శకుంతల, గీత, హైమావతి, పర్వతాలు, శ్రీనివాసులు, కిషోర్, ధనరాజ్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం



వెల్దండ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సోమవారం సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, నాయకులు గోపాల్‌నాయక్, హన్మంత్‌నాయక్, కాడురామ్‌నాయక్, జయరాంనాయక్, సాజ్యనాయక్, రఘు, రమేష్‌నాయక్, రాహుల్, తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

వెల్దండ: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని ఏఓ శోభారాణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణమాఫీ జాబితాలో పేర్లు ఉండి రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాలను స్వీకరించారు. 561 మంది రైతులకు 377 రైతుల వివరాలను సేకరించినట్లు తెలిపారు. మిగిలిన రైతులు వివరాలు అందించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాధవరెడ్డి



నాగర్‌కర్నూల్: రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన కొండకింది మాధవరెడ్డి ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

వీల్‌చైర్ అందజేత

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో గ్రామానికి చెందిన కోమల్ల గెల్వమ్మ కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కొందరు సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి సోమవారం ఫౌండేషన్ చైర్మన్ రాములు యాదవ్ గెల్వమ్మకు వీల్‌చైర్‌ను అందజేశారు. నాయకులు సాంబయ్య గౌడ్, పర్వతాలు, వీరయ్య గౌడ్, సురేష్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.



నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను పలు శాఖల అధికారులు మున్సిపల్ చైర్మన్ సత్యంతో కలిసి పలు శాఖల అధికారులు సోమవారం పట్టణంలోని పలు కుంటలను పరిశీలించారు. మోడల్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న కుంట, దేవరకొండ రోడ్డులో ఉన్న మరో కుంటలో నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. కుంటలను పరిశీలించిన వారిలో కౌన్సిలర్లు రాచోటి శ్రీశైలం, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఏఈ అహ్మద్, కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



తెలకపల్లి: వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని జిల్లా ఉపవైద్యాధికారి వెంకటదాసు అన్నారు. సోమవారం మండలంలోని రాకొండ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహా, హెల్త్ అసిస్టెంట్ రవిందర్‌రావు, కస్తూర్బాగాంధీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద.. నిలిచిన రాకపోకలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగుపై వరద కొనసాగుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజుల కిందట రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల నుంచి భారీగా వరద పోటెత్తడంతో బైరాపూర్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. మండలంలోని అజిలాపూర్, కుందారంతండా, లాలుతండా, బైరాపూర్, చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి, తూర్పుతండా, పడమటితండా, చంద్రాయన్‌పల్లి, గోకారం, ఎర్రవల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకొని శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బైరాపూర్ వాగుపై వరద ప్రవాహం

సొసైటీ రైతుల నిరసన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని సొసైటీలో ఉన్న రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు మాట్లాడుతూ సొసైటీలో మొత్తం 499 మంది రైతులకు రూ.3.26 కోట్లు రుణాలు ఉన్నాయన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ,నాయకులు రాజేష్, ,సురేందర్‌గౌడ్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ..



కల్వకుర్తి టౌన్: జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కమ్యూనిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఏజెన్సీ సిబ్బంది నిరసన చేపట్టారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు, ఇతర విభాగాలలో పనిచేస్తున్న వారికి ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి జీతాలు వచ్చే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. రాజశేఖర్, మంజుల, షంషీర్, సలాం, జంగయ్య, విజయలక్ష్మి, రేవతి, సైతమ్మ, రాములమ్మ, అలివేలు ఉన్నారు.

వీఆర్‌ఏలను ఆదుకోండి

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శివన్నగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ 81, 85లతో 2500 మంది వీఆర్‌ఏలు నష్టపోయారని పేర్కొన్నారు. దీంతో 55–61 సంవత్సరాల వారు పదవీవిరమణ పొందాల్సి వచ్చిందన్నారు. జీఓలను రద్దు చేసి వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని కోరారు. రమేష్ నాయుడు, ఈదన్న, వెంకటస్వామి, కుర్మయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జీల్గుపల్లిలో పోషణ మాసోత్సవాలు

లింగాల: మండలంలోని జీల్గుపల్లిలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి పౌష్టికాహారం గురించి పిల్లలకు, తల్లులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించి వాటి ప్రయోజనాల గురించి వివరించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యర్తలు పాల్గొన్నారు.

న్యాయ అభియాన్‌పై అవగాహన



కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు పరిధిలోని చెంచుగూడెం, నార్లాపూర్ సమీపంలో ఉన్న చెంచుగూడెంలో ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై ఐటీడీఏ ఏపీఓ యాదమ్మ చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ చెంచుగూడెం, పెంటల అభివృద్ధికి ప్రభుత్వం రూ.24 వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషోర్, చెంచు సంఘం నాయకులు శివ, తదితర చెంచులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడికి పూజలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండపాలలో కొలువుదీరిన గణనాథులకు మూడో రోజు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయక ప్రతిమలను చూసేందుకు కుటుంబసమేతంగా సందర్శిస్తున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్నారు. మహిళలు బొడ్డెమ్మలు, కోలాటాలు ఆడారు. మండపాలు ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. వినాయక విగ్రహాలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి యువకులు, చిన్నారులు తరలివచ్చారు.
- కొల్లాపూర్‌లో పలు వినాయక విగ్రహాల వద్ద సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. సీఐ మహేష్ వినాయక విగ్రహాలను దర్శించుకున్నారు. మూడో రోజు పలు వినాయక విగ్రహాలను పలువురు కేఎల్ఐ కాల్వలో, సోమశిలలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సీతారామ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణనాథుడికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.
- తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువకులు కోలాటాలు ఆడారు. భజనలు చేస్తూ సందడి చేశారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు.
- పెంట్లవెల్లి రామాలయం వీధిలో శ్రీరామసేన యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- కల్వకుర్తి మున్సిపాలిటీలోని వాడవాడలా నెలకొల్పిన గణనాథులు పూజలు అందుకుంటున్నాడు. ఈ ఏడాది అధిక సంఖ్యలో మట్టి వినాయకులను ప్రతిష్ఠించారు.
- అమ్రాబాద్, పదర మండల కేంద్రాల్లో మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు.
- అచ్చంపేట పట్టణంలోని పలు దేవాలయాలు, మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. మండపాలు, దేవాలయాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.
- మన్ననూర్ హిందూ వాహిని గణేశ్ మండపంలో యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆటపాటలతో సందడి చేశారు.
- తెలకపల్లి మండల కేంద్రం వినాయకుడికి ఉండ్రాళ్లు, పులిహోర నైవేద్యాలు సమర్పించారు.
- చారకొండ, జూపల్లి, సిర్సనగండ్ల గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సిర్సనగండ్లలో 30 సంవత్సరాలుగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తు న్నారు.
- అచ్చంపేటలో భారీ గణనాథులను చూసేందుకు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో మూడు రోజు వినాయక నిమజ్జనం చేశారు.
- ఊర్కొండ మండల వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు.



అచ్చంపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



కల్వకుర్తిలో..



నాగర్‌కర్నూల్ రామాలయం వద్ద..



తెలకపల్లిలో ..

వంతెనకు మరమ్మతు



వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి వద్ద మట్టికొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోతకు గురైన స్థలంలో మట్టి వేశారు. తాత్కాలికంగా రాకపోకలు కొనసాగేలా చర్యలు చేపట్టాలరు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమూర్తి, మాజీ సర్పంచ్ పత్యనాయక్, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుజ్ఞానం వివరాల ప్రకారం మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన తైలి పరమేష్‌ను అదే గ్రామానికి చెందిన గోరెంట్ల రేణయ్య కులం పేరుతో దూషించాడు. ఈనెల 6న ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతుండగా రేణయ్య కులంపేరిట దూషించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com